క్లుప్తంగా

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

తాంసి: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై ఆడిట్ బృందం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా తనిఖీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు, రికార్డులు అందజేసి ఆడిట్ బృద సభ్యులకు సహకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో విజయ, ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం'

సిరికొండ: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ నాయకులు ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. శనివారం మండలంలోని సోన్‌పెల్లి గూడ, ఇన్కర్ గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కుంరం కోటేశ్వర్ రావు, నాయకులు పసుల చంటి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాలతో అలంకరించిన అంబేడ్కర్ విగ్రహం

ఇంద్రవెల్లి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి విద్యుత్ దీపాలతో అలంకరించారు. అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారికి ఇరువైపులా తోరణాలు, జెండాలు ఏర్పాటు చేశారు.

రిమ్స్‌లో రక్తదానం

ఎదులాపురం: కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రిమ్స్‌లో శనివారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ మండలంలోని చించుఘాట్ గ్రామానికి చెందిన గేడం చంద్రభాన్ కిడ్నీలు చెడిపోయి డయాలసిస్‌తో బాధపడుతున్నాడు. దీంతో ఆయనను పరామర్శించారు. ఆయనకు ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం కాగా కావాల్సిన రక్తాన్ని దాతల ద్వారా అందించారు. ఇందులో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్, నాయకులు అశోక్, రాము, సుజయ్, కృష్ణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఎస్సీ వర్గీకరణ

ఇచ్చోడ: పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ ఎస్సీ వర్గీకరణ పేరుతో రాజకీయం చేస్తుందని మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శాంతపురం రాజేశ్వర్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఒక్కటిగా ఉన్న దళితులను వీడదీసేందుకు ప్రయత్నిస్తుందన్ని మండిపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాలాలు బీజేపీకి ఓటు వేయవద్దన్నారు. కార్యక్రమంలో బత్తుల శివ, తొగరి రాజేశ్వర్, ఇదుల్ల రాకేశ్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కలాల్ శ్రీనివాస్



సీఎంతో కలాల్ శ్రీనివాస్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ తాలూకా మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ కలాల్ శ్రీనివాస్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సంఘం ఉపాధ్యక్షుడు గంట సురేశ్, సంతోష్ ఉన్నారు.

ఆహ్లాదానికి C/o గాంధీపార్కు

- కాలనీల్లో పార్కులు అభివృద్ధి చేసినా..
- ఇక్కడికి వచ్చేందుకే ప్రజల ఆసక్తి
- మరిన్ని వసతులు కల్పిస్తే ప్రయోజనకరం



పార్కులోని చిన్నారుల ఆట పరికరాలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు కేరాఫ్‌గా నిలుస్తోంది. వేసవిలో ప్రజలు సరదాగా కుటుంబసభ్యులతో గడపడం, సేద తీరేందుకు ఈ పార్కునే ఆశ్రయిస్తున్నారు. దీంతో ఏటికేడు సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. మరికొన్ని రోజుల్లో బడులకు వేసవి సెలవులు కానుండటంతో పార్కుకు వచ్చే వారి సంఖ్య పెరగనుంది. అందుకనుగుణంగా ఇటీవల పార్కులో కొన్ని వసతులను మెరుగుపర్చినప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటే పార్కును సందర్శించే ప్రజలకు మరింత ఆహ్లాదంతో అందించవచ్చు. చిన్నారులు ఆడుకునేందుకు మరిన్ని ఆట పరికరాలు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఏళ్ల క్రితం నాటి ఏకైక పార్కు



పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలనే ఉద్దేశంతో కైలాస్‌నగర్ కాలనీ పరిధిలో ఇరవై ఏళ్ల క్రితం విశాలమైన స్థలంలో గాంధీ పార్కును ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలు ఈపార్కును సందర్శిస్తుంటారు. సందర్శకుల సౌకర్యార్థం సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. జారుడు బల్లలు, ఊయ్యాలలు వంటి చిన్నారుల ఆట పరికరాలతో పాటు మిక్కిమౌస్‌ను కూడా ఏర్పాటు చేశారు. మార్నింగ్ వాకర్స్ కోసం ప్రత్యేక వాకింగ్ ట్రాక్, వ్యాయమం చేసే వారి కోసం రెండు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే బర్త్‌డేలు, పెళ్లీ రోజు వంటి చిన్నపాటి శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా ఓపెన్ ఆడిటోరియంను నిర్మించారు. సందర్శకులను ఆకుట్టుకునేలా ఇటీవల రకరకాల మొక్కలతో కూడిన ప్రీడం పార్కు ఏర్పాటు చేశారు.

సమస్యలు లేకపోలేదు



పనిచేయని వాటర్ ఫౌంటేన్

పార్కులో సౌకర్యాలు మెరుగుపడుతున్నప్పటికీ పలు సమస్యలు కూడా ఉన్నాయి. సందర్శకులకు ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేషన్‌లు పని చేయడం లేదు. అందు కోసం నిర్మించిన నీటితొట్టిలు అలంకారప్రాయంగా మారాయి. అలాగే ప్రజలు సేదతీరేందుకు వీలుగా పచ్చిక బయళ్లు సైతం అంతగా లేవు. నిర్వహణ లోపంతో గడ్డి ఎండిపోయి పచ్చదనం లోపించింది. అలాగే చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ట్రైన్ రిపేర్లకు గుర్రై కదలకుండా నిలిచిపోయింది. గతేడాదిన్నరగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో పార్కుకు వచ్చి ట్రైన్‌లో సంచరిద్దామని ఆశించే చిన్నారులకు నిరాశే ఎదురవుతోంది. ఇలాంటి సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టి సారించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలనే ప్రజలు కోరుతున్నారు.

మొరం కాదు.. ఇసుక తవ్వకాలే

- తహసీల్దార్ తప్పుడు నివేదిక ఇవ్వడం సరికాదు
- ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని ఆదివాసీల డిమాండ్



ఇసుక గుంతను చూపిస్తున్న ఆదివాసీలు

బేల: వాగులో మొరం కాదు.. అక్రమ ఇసుక తవ్వకాలేనని కొబ్బాయి గ్రామ ఆదివాసీలు అన్నారు. శనివారం మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని కొబ్బాయి గ్రామంలోని వాగులో మట్టి తవ్వకాలేనని ఈనెల 12న తహసీల్దార్ సవాయిసింగ్, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోకు తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆరోపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా తప్పుడు నివేదిక ఇవ్వడం సరికాదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పెసా చట్టానికి విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతంలో మట్టి మొరం తవ్వకాలకు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. వాగులో నాలుగు కిలోమీటర్ల మేర లోతైన గుంతలు ఉన్నాయన్నారు. రాత్రి సమయంలో అక్రమంగా టిప్పర్లను తరలిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మడావి బాబారావు, సాగర్, దీపక్, దినేష్, నిలేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ గ్రామపంచాయతీ పరిధిలోని లింగపూర్(సంగరంగూడ)లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఇచ్చోడ మండలంలోని మాధపూర్ గ్రామానికి చెందిన నారాయణ మహరాజ్, కెరిమెరి మండలానికి చెందిన కుల్‌కార్ని మహరాజ్‌ల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలను చేపట్టారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయణించాలన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు సెల్కే వెంకట్‌రావ్, నాందురే జనార్దన్, సెల్కే మారుతి, సెల్కే అనిరుద్, నాందురే మనోహర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

ఎదులాపురం: శ్రీరామ నవమిని పురస్కరించుకుని అంతర్జాతీయ కృష్ణ చైతన్య మండలి (ఇస్కాన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఇస్కాన్ ప్రతినిధి ప్రేమ్ నర్తన్ దాస్‌జీ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని రాంపూర్‌రోడ్‌లోని ఇస్కాన్ ఆలయంలో ఈనెల 15, 16, 17వ తేదీల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పల్లకి సేవ, కీర్తనలు, సీతారాముల కల్యాణం కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు పూర్ణ చంద్ర కృష్ణప్రభు, గిరివరదాస్, ప్రమోద్ ఖత్రి పాల్గొన్నారు.

'పని చేసే నాయకులకు గుర్తింపు లేదు'



మాట్లాడుతున్న జాఫర్, నాయకులు

ఎదులాపురం: ఎంఐఎంలో కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు, ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆ పార్టీ నాయకులు, వార్డు సభ్యుడు జాఫర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ శనివారం మాట్లాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నజీర్ అహ్మద్ ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలకు పోతున్నాడని ఆరోపించారు. కార్యకర్తలు, అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ చేపడుతానని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మోయిన్, షైక్ చాంద్, సోహెల్, సయ్యద్ లతీఫ్, సాజిద్, రఫీక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న శత చండీయాగం



పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ అభ్యర్థి నగేశ్

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని దుర్గనగర్‌లో నవశక్తి దుర్గామాత ఆలయంలో ఆలయ పూజారి కిషన్ మహరాజ్ ఆధ్వర్యంలో శత చండీయాగం కొనసాగుతోంది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అమ్మవారిని కోరుకోవడం జరిగిందన్నారు.

రోడ్లపై చెత్తవేస్తే జరిమానా

ఇచ్చోడ: మండల కేంద్రంలో రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించనున్నట్లు మేజార్ పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శనివారం పలు కాలనీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలు కూడళ్ల వద్ద పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్మికుల ద్వారా తొలగించారు.

సంక్షిప్త వార్తలు

గుండాలలో పశువైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని గుండాలలో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. టీకాలు వేయడం ద్వారా వర్షకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శేఖర్, దేవరావులు ఉన్నారు.

విదేశీ కరెన్సీ ప్రదర్శన

నేరడిగొండ: బోథ్ మండలంలోని సొకెర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సొనాల గ్రామానికి చెందిన బొశెట్టి రాజ్ కుమార్ విదేశీ కరెన్సీ నోట్లను ప్రదర్శించారు. వాటి విలువను తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుషా, ఉపాధ్యాయుడు కమలాకర్, శ్రీరామ్‌విజయ్, అంగన్‌వాడీ కార్యకర్త సుశీల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఇచ్చోడ: ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకులు ఆత్రం భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని బాదిగూడ, దాబా(కె), తలమద్రి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కుంరం కోటేశ్వర్, పసుల పాల్గొన్నారు.

ఆహ్వానపత్రాలు అందజేత

ఖానాపూర్: ఈ నెల 17న పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ హన్మాన్ మందిర్‌లో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆలయకమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంతో పాటు పలువురు ప్రముఖులు, నాయకులు, అధికారులకు ఆహ్వానపత్రాలు అందజేశారు. అంతకముందు స్వామివారి కల్యాణోత్సవానికి కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాలెపు సుదర్శన్ రూ.5వేలు అందజేశారు.

సమాచారం తెలిపేలా... అవగాహన కలిగేలా



కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలుపడంతో పాటు పోలింగ్ తేదీపై అవగాహన కల్పించేలా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బారీ హోర్డింగ్ ఆకట్టుకుంటుంది. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్ వరకు ఆయా తేదీలను తెలిపేలా సమాచారం పొందుపర్చారు. వివిధ పనుల కోసం కలెక్టరేట్‌కు వచ్చిన ఉద్యోగులు, అధికారులతో పాటు సామాన్య ప్రజానీకం సైతం హోర్డింగ్‌ను ఆసక్తిగా గమనిస్తున్నారు.

సమష్టి కృషితో కాంగ్రెస్ అధికారంలోకి!



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: కార్యకర్తలు, నాయకులు, ప్రజల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలింగ్ బూత్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించేందుకు బూత్‌స్థాయి నుంచి పనిచేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ ఆడే వసంత్‌రావు, నాయకులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, జాదవ్ కపిల్‌దేవ్, మురళిగౌడ్, పోతారెడ్డి, అనుపట్ల సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపిస్తాయని బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పోలింగ్‌బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జల్కే పాండురంగ్, ఉద్ధవ్, పోరెడ్డి నారాయణ, బత్తిని కిషన్, రమేశ్, మహబూబ్, రాంకిషన్, మద్దే రమణ, భాస్కర్‌రెడ్డి, విఠల్ పాల్గొన్నారు.

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. శనివారం బోథ్ మండల కేంద్రంలోని షాదీఖానాలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. శనివారం ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని 35వార్డుకు చెందిన ఎంఐఎం కౌన్సిలర్ ఫౌజియా బేగంతో పాలు పలువురు కాలనీవాసులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే కరంజి మాజీ ఉప సర్పంచ్ బిక్కి గంగన్న, మాజీ ఆత్మ డైరెక్టర్ దర్శనాల అశోక్, బొల్లెం అశోక్, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, తంతోలి, సొసైటీ గూడ, కచ్‌కంటి, జైనథ్ మండలంలోని సాంగ్వి, కరంజి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎన్నికల ప్రచారానికి సంబంధించిన డోర్ స్టిక్కర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, బాలూరి గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ మాజీ సర్పంచ్ కినక జుగాదిరావ్, హీరాపూర్ మాజీ సర్పంచ్ గోడం నాగోరావ్‌లు శనివారం ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరా రు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటువేసి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు జహీర్, సోమోరే నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం'



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కేటాయించని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 17 ఎంపీ స్థానాలు ఉంటే అందులో మూడు ఎస్సీ రిజర్వేషన్ స్థానాలు ఉన్నాయన్నారు. ఒక్క టికెట్ కూడా కాంగ్రెస్ మాదిగలకు కేటాయించకుండా మాదిగల రాజకీయ అస్తిత్వాన్ని, ఉనికిని చంపేస్తుందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి స్వార్థపరులతో, మంత్రులతో ఎమ్మార్పీఎస్ ఉద్యమంపై విషం చిమ్మడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, పసుల వేణు, జిల్లా కార్యదర్శి ఆరెపల్లి సురేశ్, స్వామి, కొమ్ము కిరణ్, డోంగ్రె సంజీవ్, చిరు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కుతోనే ఆదివాసీల అభివృద్ధి



ప్రజలతో మాట్లాడుతున్న ఆదివాసీ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: ఆత్రం సక్కుతోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు ఆదివాసీ నాయకులు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న ఆత్రం సక్కుకు కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అందులో భాగంగానే శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి, సొసైటీ గూడ, సిరికొండ, చించుఘాట్, కొత్తూర్, అంకాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఏనాడూ ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంతరమే ఆదివాసీల గ్రామాలకు రోడ్డు, విద్యుత్, తాగునీరు, నాణ్యమైన వైద్యం, విద్య అందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమ్ర రాజు, మోతిరాం, సిడాం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వారసంత



నేరడిగొండ: మండల కేంద్రంలోని వారసంత సర్వీస్ రోడ్డుపైనే కొనసాగుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇతర గ్రామాల నుంచి వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు ప్రజలు అధికంగా వస్తుండడంతో తిప్పలు తప్పడం లేదు.